ప్రజాశక్తి
సోమవారం 2 జూన్ 2025 5
శ్రీ సత్యసాయి

కార్డుదారురాలులకు బియ్యం అందజేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ టిఎస్. చేతన్

ధాన్యం కొనుగోలులో దగా..!

- సొమ్ముచేసుకుంటున్న వ్యాపారులు, దళారులు
- లబోదిబోమంటున్న వరిరైతు
- పట్టించుకోని అధికారులు

పొలంలో వరిధాన్యాన్ని తూకం వేసి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి పక్కరాష్ట్రానికి తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి రొద్దం

ధాన్యం కొనుగోలులో దగా జరుగుతోంది. రైతన్నలు వరి నాటినప్పటి నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాలను అధిగమించి పంట పండిస్తే ధాన్యం విక్రయాలలో దగాకు గురి అవుతున్నారు. వ్యాపారుల చేతిలో అన్నదాతలు నలిగిపోతున్నారు. ఎంత నలిగిపోతున్నా చేసేది లేక నిస్సహాయ స్థితిలో తన పంటను వారికే విక్రయిస్తున్నాడు. రైతుల ఇబ్బందులను పాలకులు, అధికారులు తొలగించలేకపోతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నిర్దేశించిన ప్రకారం వరి ఒక సంచికి 70 కేజీలు ధాన్యం తూకం వేయాలి. అయితే రైతన్నలు శుద్ధి చేయలేదని, తేమ ఎక్కువగా ఉందన్న నేపంతో వ్యాపారస్తులు అదనంగా రైతుకు తెలిసిన విధంగానే 10 కేజీల వరకు ఎక్కువ తూకాలు వేస్తున్నారు. అంతటితో ఆగకుండా మొత్తం మూట గట్టి అన్నో ఎన్నో మిగిలిన వడ్లు కూడా లెక్కగట్టకుండా డబ్బులు చెల్లిస్తున్నారు. చేసేది లేక మరో మార్గం లేక ఇచ్చినంత తీసుకొని రైతులు మౌనంగా ఉండి పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతులు నష్టపోతున్నది ఇలా...

మండల కేంద్రంలో ప్రస్తుతం వరి వార్పు పూర్తి అయింది. రైతులు తమ ఇంటి అవసరానికి కొన్ని తీసుకొని మిగిలిన ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క బస్తా 70 కేజీలు తూకం అయితే వరి ధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉన్నదని మరో 10 కేజీలు ఎక్కువగా తూకం పెట్టి అదనపు భారం రైతులపై మోపుతున్నారు. మోసం జరుగుతున్నదని తెలిసినా కూడా రైతులు ప్రశ్నించలేని పరిస్థితి. వ్యాపారులు వద్దంటే అధాన్యానికి ధర ఉండదేమో అని మళ్లీ వ్యాపారులు రారేమోనని అనుమానం రైతులను వేధిస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారస్తులు తమ ఆగడాలను కొనసాగిస్తున్నారు.

పక్క రాష్ట్రాలకు తరలి వెళ్తున్న వరి ధాన్యం

పక్క రాష్ట్రమైన కర్నాటక వ్యాపారులు ఆంధ్ర దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కర్నాటక, అనంతపురం తరలిస్తున్నారు. 80కేజీల వరిధాన్యం రూ. 1500 నుంచి 19వందల రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారు.

మొక్కజొన్న పంట కొనుగోలులోనూ దగా

మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు వ్యాపారస్తులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. మండల కేంద్రంలో అధిక శాతం మొక్కజొన్న పంట రైతుల పండిస్తున్నందున వ్యాపారులు తమ పంట పండించుకుంటున్నారు. రైతుల వద్ద వ్యాపారస్తులు 60 కేజీల మొక్కజొన్నలకి మూడు కేజీల వరకు అదనం వేసుకుని కొనుగోలు చేస్తున్నారు. అందులో మూడు కేజీలపై 200 గ్రాములు 300 గ్రాములు ఎటుబడితే అటు ఎడాపెడా వాయిస్తున్నారు. అయినా రైతులు చేసేది లేక వారికే విక్రయిస్తున్నాడు. రైతులకు వ్యాపారస్తుల ముందుగానే అప్పుగా డబ్బులు ఇచ్చి ఇక పంట ఎవరికి ఇవ్వకుండా, ధరలు కూడా అప్పుడు వారు నిర్ణయించిన ధరకే విక్రయించే విధంగా నిశ్చయించుకుంటున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి కూడా అందలేక అప్పుల పాలవుతున్నారు. వ్యాపారస్తుల మాత్రం లగ్జరీ జీవితాన్ని అనుభవిస్తున్నారు. గతంలో వ్యాపారస్తులు బాడుగకు వాహనాలు తీసుకుని కొద్దికొద్ది పంటను మాత్రమే తరలించేవారు. అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించిన తూకం వేసేవారు. ఇప్పుడు 120 కేజీలకు గాను 6 నుంచి 7 కేజీలు అధికంగా ట్రూ కాలర్ వేస్తుండటంతో వ్యాపారులు, దళారులు బాగుపడుతున్నారు. ఇలా అదనంగా రైతులను నుంచి తీసుకున్న ధాన్యంతో ఒకేసారి లారీలతో తరలించి వాటిని కాటా పెట్టడంతో దాదాపు ఒక్కొక్క లారీకి లక్ష రూపాయల వరకు లాభాలు గడిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోసకారి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, రైతులు పండించిన పంటను ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ

బియ్యం పంపిణీలో మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-పెనుకొండ

విమర్శలకు తావు లేకుండా పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలని మంత్రి సవిత రేషన్ డీలర్లకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండు నూతన రేషన్ డీలర్ షాపులను మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎండియు వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వానికి ఎంతో నష్టం కలిగించిందన్నారు. వాహనాలు ఇంటికి పోకుండా వీధిలో ఒక చోట ఇవ్వడం జరిగిందని, వాహనం ఎప్పుడొస్తుందో తెలియక కార్డుదారులు ఇబ్బంది పడేవారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తమకు వీలైన సమయంలో ఏ స్టోర్ వద్ద అయినా 1 తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు సులువుగా తీసుకోవచ్చన్నారు. 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు వికలాంగులకు ఎటువంటి ఆటంకం కలవకుండా వారింటి వద్దకే డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఒక్కో ఎండియు ఆపరేటర్‌కు రూ.21వేలు వేతనాలు చెల్లించే వారిని దీనివల్ల ప్రభుత్వంపై ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా రూ. 233 కోట్ల భారం పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, ఆర్డీవో ఆనందకుమార్, తహాశీల్దార్ శ్రీధర్, సిఎస్‌డిటి ప్రభావతి, నాయకులు మునిమడుగు చిన్న వెంకటరాముడు, నారాయణస్వామి, శ్రీనివాసులు, కేశవయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, బాబుల్ రెడ్డి, త్రివేంద్ర నాయుడు, సోమశేఖర్, కూటమి నాయకులు ఎనుముల రామకృష్ణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయ భవనాలు ఏర్పాటు చేయండి

పెనుకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయ భవనాలు ఏర్పాటు చేయాలని పెనుకొండ పట్టణానికి చెందిన వ్యాపారస్తులు, ప్రజలు మంత్రి సవితకు, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీలో దాదాపు 30వేల జనాభా ఉందన్నారు. పట్టణంలో మెయిన్ రోడ్డు లో అధిక భాగం ప్రభుత్వ కార్యాలయాలు ఉండడం వల్ల వ్యాపార సముదాయ భవనాలు ఏర్పాటు కొరకు స్థలం ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. ఇప్పటికే రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వెనుక వైపు ప్రహరీకి ా చిన్న చిన్న అంగళ్లు పెట్టుకోవటంతో ఆ స్థలం ఆక్రమణకు గురైందన్నారు. దీంతో రోడ్డు చిన్నది కావడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. మార్కెట్ రోడ్డులో ఉన్న సులభకాంప్లెక్స్ కు ఇరువైపులా వ్యాపార సముదాయ భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవో ఆఫీస్ దగ్గర గల బయలు స్థలాన్ని కేటాయించి, వ్యాపార సముదాయ భవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం పరిశీలించాలని వారు కోరారు. ఈ వ్యాపార భవన సముదాయన్ని నిర్మిస్తే, బాడుగులు రూపంలో ప్రభుత్వానికి అదనపు ఆదాయం వస్తుందని వివరించారు. అదేవిధంగా నగర పంచాయతీ పరిధిలో ఉన్న కోనాపురం ఇస్లాపురం వెంకటరెడ్డి పల్లి వెంకటాపురం తండా పరిధిలో అత్యధికంగా పనులు చేసుకుని జీవించేవారు ఉన్నారనితెలిపారు. వీరికి ఉపాధి హామీ పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ విన్నవించారు. ఈ కార్యక్రమంలో రఘువీరా చౌదరి సిద్దయ్య శ్రీరాములు యాదవ్ ఈశ్వర ప్రసాద్ రమణమ్మ లక్ష్మీదేవి చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలగా నసనకోట 'ఎంజేపీ'

చెన్నేకొత్తపల్లి : రామగిరి మండలం నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయనున్నట్లు మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. నసనకోటలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి మంత్రి సవిత ఆదివారం సందర్శించారు. తరగతి గదులు, విశ్రాంతి గదులు, కంప్యూటర్ ల్యాబ్స్, వంటగది, బాత్రూంలను పరిశీలించారు. పది ఎకరాల సువిశాల ప్రాంగణంలో మౌలిక వసతులతో కూడిన ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల నిర్మించడంపై మంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రాష్ట్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంజేపీ స్కూళ్ల నిర్మాణానికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రామగిరి మండలం నసనకోటలోని ఎంజేపీ బాలికల పాఠశాలను పది ఎకరాల్లో నిర్మించారన్నారు. ఈ స్కూల్ నిర్మాణానికి మాజీ మంత్రి పరిటాల రవీంద్ర పేరున ఆయన సతీమణి, ఎమ్మెల్యే పరిటాల సునీత పది ఎకరాలు భూమి అందజేయడంపై మంత్రి సవిత సునీతను అభినందించి హర్షం వ్యక్తంచేశారు.

జూనియర్ కాలేజీగా అప్ గ్రేడ్

కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను నిర్మించారని మంత్రి సవిత తెలిపారు. ఇంటర్ విద్యకు కావాల్సిన అన్ని వసతులు, సౌకర్యాలు కూడా ఉండడంతో, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కాలేజీగా అప్ గ్రేడ్ చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులంతా ఇంటర్ విద్య కూడా ఇక్కడే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ట్రంకు పెట్టెలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ స్కూల్ ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి పంచాయతీ పొబ్బర్లపల్లికి చెందిన పెద్ద బోయ నాగరాజు(35) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న ఐదెకరాల వ్యవసాయ పొలంలో పంటల సాగుకు, బోరుబావుల తవ్వకానికి, కుటుంబ అవసరాలకు దాదాపు రూ. 10 లక్షల దాకా అప్పులు చేశాడు. ఓవైపు పంటలు సరిగా పండక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక మనోవేదనకు గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇంటి దులానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అన్నదానం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి ఆవరణంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీ. యున్. వెంకటేష్ కుమార్తె భవ్య సుధా వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం సంతకు వచ్చిన గ్రామీణ ప్రజలకు పెనుగొండ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శంకరప్ప ఆధ్వర్యంలో150 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, నాగార్జున, పద్మావతి, ప్రభావతి, నందిని దేవి పాల్గొన్నారు

రాష్ట్రాన్ని నట్టేట ముంచిన కూటమి సర్కార్

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి హిందూపురం

అధికారం కోసం అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కూటమి సర్కార్ మోసం చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంట్ పరిశీలకులు రమేష్ రెడ్డి విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు ఆయన సూచించారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకులు రమేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల ముందు కూటమి ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలను మభ్య పెట్టారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలపై రూ.15,800 కోట్ల విద్యుత్ భారాన్ని మోపారన్నారు. ఈ నేపథయంలో ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌలూరు మధుమతి రెడ్డి, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ ముదిరెడ్డిపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మహేష్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

జులై 15 వరకు వేరుశనగ విత్తుకోవచ్చు

వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వైవి. సుబ్బారావు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఖరీఫ్ సీజన్ జూన్ నెల నుంచి ప్రారంభమైందని జూన్ 15 నుంచి జూలై 15 వరకు రైతులు వేరుశనగ విత్తనం విత్తుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి. సుబ్బారావు తెలిపారు. జిల్లాలో వర్షాధారమైన వేరుశనగ, కంది. ఉలవ. పెసర తదితర పంటల పైన రైతులు ఆధారపడి ఉన్నారు. ఏటా అతివృష్టి, అనావృష్టి వల్ల సాగుచేసిన పంటలు దెబ్బ తినడం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి చేతికి రాకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరగడం గిట్టుబాటు ధరలు లేకపోవడం కూడా వ్యవసాయంపై రైతులు అనాసక్తి చూపుతున్నారు. ప్రతిసారి ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురవడం పంటలు పెట్టడం ఆ తరువాత అతివృష్టి లేదా అనావృష్టితో మెట్ట వ్యవసాయం దెబ్బ తినడం పరిపాటిగా మారింది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం ముందు నుంచే రుతు పవనాలు ప్రవేశించడం అదునులో వర్షాలు కురియడంతో రైతులు తమ భూములను దుక్కి దున్ని చదును చేసే పనులలో తల మునకలవుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వాతావరణ నిపుణులు ఈ ఏడాది వర్షాలు బాగా కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సబ్సిడీ వేరుశనగ, కందులు పంపిణీ, విత్తన శుద్ధి తదితర అంశాలపై జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి. సుబ్బారావు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వివరించారు.



ప్రశ్న : జిల్లాలో సాగు భూమి ఎంత ఉంది? ఈ ఖరీఫ్ లో ఎంత సాగు చేయనున్నారు?

జవాబు : జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 2,22,950 హెక్టార్లు ఉంది ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో దాదాపు 80 శాతం వేరుశనగ సాగు చేయవచ్చని భావిస్తున్నాము. అలాగే అంతర్ పంటలైన కంది, పెసర, ఉలవ, అలసంద తదితర పంటలు సాగు చేసే అవకాశం ఉంది.

ప్ర : జిల్లాకు విత్తన వేరుశెనగ ఎన్ని క్వింటాలు రానున్నాయి? ధర ఎంత? ఎప్పటినుంచి పంపిణీ చేస్తారు?లి

జ : వేరుశనగ విత్తన కాయలు జిల్లాకు 63, 918 క్వింటాళ్ళు, కందులు 1275 క్వింటాళ్లు రానున్నాయి. ఇప్పటికే జిల్లాలోని రైతు సేవ కేంద్రాలకు విత్తన కాయలు చేరుతున్నాయి. 30 కేజీల కె6 రకం వేరుశనగ బస్తా ధర 2790 రూపాయలు కాగా, 40 శాతం సబ్సిడీ పోను 1674 రూపాయలు రైతులు చెల్లించాలి. కదిరి, లేపాక్షి రకం 30 కేజీల బస్తా పూర్తి ధర 2460 రూపాయలు కాగా సబ్సిడీ పోను రైతు వాటా క్రింద 1476 రూపాయలు చెల్లించాలి. అర ఎకరం వరకు ఒక బస్తా, ఒక ఎకరాకు రెండు బ్యాగులు, ఆ పైన ఉన్న రైతులకు మూడు బ్యాగులు గరిష్టంగా పంపిణీ చేయడం జరుగుతుంది. రేపటి నుంచి రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. కందులకు ప్రభుత్వం ఇంకా ధర నిర్ణయించాల్సి ఉంది. వేరుశెనగ విత్తన కాయలు ఈనెల 6వ తేదీ నుంచి పంపిణీ జరుగ నుంది.

ప్ర : వేరుశనగ విత్తనం ఎప్పటి వరకు విత్తుకోవచ్చు? ఎరువులు ఎన్ని టన్నులు రానున్నాయి?

జ : వేరుశనగ విత్తనం జూన్ నెల 15 నుంచి జూలై 15 వరకు విత్తుకోవచ్చు. ఈ సమయాన్ని రైతులు మంచి అదునుగా భావిస్తారు. ఈ నెల రోజులలో ఎప్పుడైనా విత్తుకోవచ్చు. రైతు సేవా కేంద్రాలకు, సహకార సంఘాలకు 19 మెట్రిక్ టన్నుల ఎరువులు రానున్నాయి.

ప్ర : విత్తన శుద్ధి ఏ విధంగా చేసుకోవాలి?

జ : వేరుశెనగ విత్తనాలు విత్తేముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. కేజీ వేరుశెనగ విత్తనానికి విత్తన శుద్ధికి కార్బెండజిమ్ ఒక గ్రాము చొప్పున లేదా ట్రిచో డేర్మ కిలో విత్తనానికి ఐదు గ్రాములతో శుద్ధి చేసుకోవాలి. ఇలా విత్తన శుద్ధి చేయడం వల్ల వేరుశెనగకు వేరు పురుగును అరికట్టవచ్చు. అంతర్ పంటలుగా కందులు, పెసలు, అలసంద తదితర పంటలు పెట్టుకోవచ్చు. పూత దశలో వచ్చే వ్యాధుల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారి చేసుకోవాలి.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?



వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వైవి. సుబ్బారావు

జ : సిబ్బంది కొరత ఉంది ఆ పోస్టులు భర్తీకి ప్రభుత్వానికి నివేదించాము. రైతులు తమ భూములలో లోతుగా దుక్కి దున్నాలి. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ పైన విత్తన కాయలు అందజేస్తోంది. రైతులు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. విత్తనం విత్తిన తరువాత అధికారుల సలహాలు పాటిస్తూ పంటలను సంరక్షించుకోవాలి.

విద్యను మించిన సంపద లేదు

మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి - హిందూపురం

విద్యను మించిన సంపద ఏదీ లేదని... ఎన్ని ఆస్తులు, ఎంత సంపద ఉన్నప్పటికీ విద్యతో సరిరాదని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను ఆర్జిస్తే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చనిమున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని త్యాగరాజు నగర్ లో మార్గదర్శి విద్యానికేతన్ నిర్వహకులు , శ్రీ వెంకటేశ్వర మిల్క్ డైరీ నిర్వాహకులు అరుణ, సివీ నాగరాజు సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి బడుల ముగింపు కార్యక్రమం ఆదివారం పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ ప్రింటర్స్ శంకర్ అందించిన ధ్రువ పత్రాలను, ఆర్ట్ ఫ్లో నారాయణ పంపిన జ్ఞాపికలను మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం రమేష్ కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం మార్గదర్శి పాఠశాల నిర్వాహకులు సాయి కళ, మాలప్ప దంపతులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డులో గుమస్తాగా పనిచేస్తున్న పథ్వీరాజ్, ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు అనిత, మూడో వార్డు రుక్సానా బేగం, అబూబకర్, ఫ్రూట్స్ మర్చంట్ నూర్ మహమ్మద్, పాఠశాల నిర్వాహకులతో పాటు ఉపాధ్యాయులు నాగిరెడ్డి, శ్రీశైలం, బి.యస్.కుమారి, మమత, శిరి, సాయి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న మున్సిపల్ ఛైర్మన్

చౌక దుకాణాల ద్వారా మెరుగైన సేవలు : రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి చౌక దుకాణాల ద్వారా మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, బాలకష్ణ వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీలు పేర్కొన్నారు. ఆదివారం పురపాలక సంఘ వ్యాప్తంగా పలు రేషన్ దుకాణాల్లో వారు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణ, మండల వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకులను సకాలంలో పకడ్బందీగా పంపిణీ చేయడం జరుగుతుందని డిప్యూటీ తహాశీల్దార్ మైనుద్దీన్, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహాశీల్దార్ అరతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా అవార్డు కౌన్సిలర్లతో పాటు టిడిపి నాయకులు నాగరాజు, మంగేష్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఈ-పాస్ మిషన్లతో అవినీతికి అడ్డుకట్ట : ఎమ్మెల్యే

రేషన్ షాపులో బియ్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

కూటమి ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పడిందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలం నసనకోట, చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో ఆదవారం ఎమ్మెల్యే రేషన్ షాపులో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే కార్డుదారులకు రేషన్ అందజేశారు. అనంతరం 65 ఏళ్లు పైబడిన వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామని చెప్పి పెద్దఎత్తున దోపిడీకి తెరలేపారన్నారు. అలాగే కార్డుదారులు పనులు మానుకుని ఎండియు వాహనం కోసం ఎదురు చూసే దుస్థితి కల్పించారన్నారు. సిఎం చంద్రబాబు ఉన్నతస్థాయిలో సమీక్ష చేసి పాత విధానంలో రేషన్ పంపిణీ చేసేలా మంచి నిర్ణయం తీసుకున్నార న్నారు. గతంలో తాను పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ-పాస్ మిషన్లు తీసుకొచ్చామన్నారు. ఈ-పాస్ మిషన్లతో అవినీతికి అడ్డుకట్ట వేశామన్నారు. నేటికీ అదే విధానంలో రేషన్ పంపిణీ జరుగుతోందన్నారు. డీలర్లు ఎక్కడా చిన్న తప్పిదానికి కూడా అవకాశం ఇవ్వకూడదన్నారు. తూకాల్లో తక్కువ ఇస్తున్నారని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇది పేద ప్రజల కోసం తీసుకొచ్చిన విధానమని, ఎక్కడా ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.

రేషన్ మాఫియాకు చెక్ పెట్టడమే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రేషన్ షాపులో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

రేషన్ మాఫియాకు చెక్ పెట్టాలని, అర్హులందరికీ పారదర్శకంగా రేషన్ అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం షాపుల వద్దే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. ఎమ్మెల్యే ఆదివారం పట్టణంలోని తాజ్ క్లినిక్ వద్ద రేషన్ దుకాణాన్ని ప్రారంభించి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో రూ. 45వేల కోట్ల విలువైన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారని మండిపడ్డారు. కరోనా కష్టసమయంలో కేంద్రం ఇచ్చిన బియ్యాన్ని పేదలకు ఇవ్వకుండా వైసిపి నేతలు అడ్డగోలుగా దోచుకున్నారన్నారు. కాకినాడ పోర్టు ద్వారా 30లక్షల మెట్రిక్ టన్నులను విదేశాలకు ఎగుమతి చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం 9,260 రేషన్(ఎండియు) వాహనాల కోసం రూ. 1,600కోట్ల ప్రజాధనం వృథా చేసి, ఆ భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఇకపై రేషన్ కోసం ఎవరూ పనులు మానుకోవాల్సిన అవసరం లేదన్నారు. నెలలో 15 రోజులు పంపిణీ చేస్తారని వీలున్న సమయంలో రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ఎక్కడైనా రేషన్ పక్కదారి పట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి పుల్లయ్యచౌదరి, వైజాగ్ రమేష్, కౌన్సిలర్లు రాజు, మేఘన రమేష్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి హేయం : సిపిఎం

సమావేశంలో మాట్లాడుతున్న జిఎల్ నరసింహులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రూరల్ మండలంలోని కుమ్మరవాండ్ల పల్లిలో ఉన్న నయారా పెట్రోల్ బంకులో రూ. 24 వేలు తేడా వచ్చిందని అందులో పని చేస్తున్న బాబాఫక్రుద్దీన్‌ను అర్ధనగ్నంగా విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టడం హేయమైన చర్య అని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెట్రోల్ బంక్ ఆర్థిక వ్యవహారాల్లో తేడా ఉంటే కూర్చొని పరిష్కరించుకోవాలి లేదా నిజంగానే ఆ యువకుడు అవకతవకలకు పాల్పడి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్పా అనాగరికంగా, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అమానుషంగా ప్రవర్తించిన పెట్రోల్ బంక్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, పెట్రోల్ బంకును సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంకులో పనిచేసే కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, కనీస సౌకర్యాలు కల్పించ లేదని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృ తమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు రామ్మోహన్, బాబ్‌జాన్, ఆంజనేయులు, సుధాకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ఫెర్రర్ చిత్రపటంతో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్‌డిటి(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్)కు విదేశీ నిధులకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను తక్షణమే పునరుద్ధరించాలని యువర్స్ ఫౌండేషన్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ విషయంపై ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సత్య నిర్ధారణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ కుల, మతాలకు అతీతంగా అనేక సేవలు అందిస్తూ సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా ఆటంకం కలిగించడం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పేదలకు అన్యాయం చేయడమే అన్నారు. భవిష్యత్తులో కూడా ఆర్‌డిటి సేవలు కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని కోరారు. అనంతరం వివిధ గ్రామాల విద్యార్థులు ఆర్‌డిటికి మద్దతుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మంత్రికి ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం ఉపాధ్యాయులు మంత్రి సవితకు వినతి పత్రం అందించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాయిదా పడిన ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల్లో సీనియర్ సెకండరీ టీచర్లకు, అడహక్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన వారికి 230 పోస్టులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కేవలం 19 పోస్టులకు మాత్రమే ఖాళీలు చూపిస్తున్నారని వారు మంత్రికి వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యదర్శి సంపత్ కుమార్, చంద్రశేఖర్, ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం, వెంగమనాయుడు, సుధాకర్, నాగరాజు, కవిత, తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విత్తన వేరుశనగ కావాల్సిన రైతుల సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవి. సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందన్నారు. వివరాలకు రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

4న 'వెన్నుపోటు దినోత్సవం'

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ చేపడుతున్న వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప, తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు నాయకులు తిప్పేస్వామి, మూర్తి, కృష్ణారెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇక రేషన్ షాపుల్లోనే పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక చౌక ధాన్యం డిపోలో ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారానే సరుకులు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకుందని, దీంతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, ఎంపిపి జి.సోమశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, డి.ఆనంద్, అక్రంబాషా, పవన్‌కుమార్, ఎస్‌వి.సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని సోమవారం వడ్డెర సంఘం పట్టణ అధ్యక్షులు దేరంగుల అంజి ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరాముడు, నారప్ప, రమణ, సుధాకర్, నారాయణస్వామి, రాజు, అనిల్, దివాకర్, చెన్నరాయుడు, శ్రీనివాసులు, సూర్యనారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో పేదల బియ్యం పక్కదారి

ఎమ్మెల్యే పల్లె సింధూర

వృద్ధురాలికి ఇంటి వద్దకు రేషన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వైసిపి ప్రభుత్వంలో పేదలకు అందించే బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండల కేంద్రాల్లో ఆదివారం ఆమె మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి చౌక దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పేదల బియ్యం పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. వృద్ధులు, వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి వద్దకు తీసుకెళ్లి అందించాలన్నారు. పేదల బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయని డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇకపై నెలలో 15 రోజుల పాటు రేషన్ షాపుల్లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తారని తెలిపారు.

కొత్తచెరువు : స్థానిక బిసి కాలనీలోని రేషన్ షాపులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వ చౌక ధాన్యం డిపో ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు వృద్ధుల ఇంటికి వద్దకు వెళ్లి నిత్యావసర వస్తువులు అందజేశారు. అంతకుముందు వారికి స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు. వారి వెంట నాయకులు ఎస్.శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, పిసి.గంగన్న, రత్నప్ప చౌదరి, సుబ్బారెడ్డి, ఒలిపి శ్రీనివాసులు, శంకర, పెద్దన్న, రాజు ఉన్నారు.

బుక్కపట్నం : రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను ప్రజలకు సక్రమంగా అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. వారు మండలంలోని జానకంపల్లి గ్రామంలో రేషన్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షాబుద్దీన్, సిఎస్‌డిటి షమీం, టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు సుబ్బారెడ్డి, వెంకటరాముడు, శ్రీనివాస్ రెడ్డి, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక రాజారెడ్డి రేషన్ షాపులో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 2 నుంచి 15వ తేదీ వరకూ ఉదయం 8 నుంచి 12 వరకూ, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ స్టోర్లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్‌రెడ్డి, పొగాకు డాక్టర్ జాకీర్ అహ్మద్, రాజారెడ్డి, ఆరిఫ్ ఖాన్, సౌదీ నాగరాజు, మీసేవ సుధాకర్, మాబాషా, నిజాం, వైదేహి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలి : పరిటాల శ్రీరామ్

రేషన్ షాపులో సరుకులు పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్, ఆర్డీవో మహేష్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానాన్ని రేషన్ డీలర్లు ముందుకు తీసుకెళ్లాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. రేషన్ డీలర్లకు కమీషన్ పెంపు లేదా వేతనం రూపంలో సాయం అందాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని ఆర్డీవో మహేష్‌ను కోరారు. రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామంలో ఆదివారం పరిటాల శ్రీరామ్ ఆర్డీవోతో కలిసి పాత విధానంలో రేషన్ పంపిణీని ప్రారంభించారు. కార్డుదారులకు రేషన్ బియ్యాన్ని అందజేశారు. అలాగే కొందరు వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందించారు. శ్రీరామ్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా పేదలకు బియ్యం సక్రమంగా సరఫరా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఒకప్పుడు రాష్ట్రంలో 39 శాతం మంది పేద కుటుంబాలకు తెల్ల బియ్యం అంటే తెలిసేది కాదన్నారు. ఏదో పండగ ఉంటే తప్ప బియ్యం వండే పరిస్థితి ఉండేది కాదన్నారు. కానీ ఎన్టీఆర్ సిఎం అయిన తర్వాత పేద కుటుంబాలకు తెల్ల బియ్యం అందించారని, ఆయన తీసుకొచ్చిన ప్రజా పంపిణీ వ్యవస్థ నేటికీ కొనసాగుతోందన్నారు.

పరిటాల శ్రీరామ్‌కు వ్యాపారుల వినతి

పట్టణంలోని ప్రధాన రోడ్లలో వ్యాపారం చేసుకుంటున్న పలువురు వ్యాపారులు ఆదివారం టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్‌తో కలిసి రూరల్ మండలంలోని పోతుకుంటలో పరిటాల శ్రీరామ్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. పట్టణంలో డ్రెయినేజీల క్లీనింగ్ పేరుతో మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా వ్యాపార సముదాయాల ముందు ఉన్న మెట్లు, బండలను జెసిబితో తొలగిస్తున్నారని వాపోయారు. ముందస్తుగా సమాచారం ఇస్తే తామే కాలువలపై బండలు, మెట్లు తొలగిస్తారని తెలిపారు. అధికారుల చర్యలతో 15 రోజులుగా వ్యాపారాలు లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన పరిటాల శ్రీరామ్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంకేపల్లిలో సమస్యలపై ఆరా

ముదిగుబ్బ : పరిటాల శ్రీరామ్ మండలంలోని సంకేపల్లి గ్రామంలో పర్యటించారు. స్థానిక నాయకులు రంగయ్యతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వీర నారాయణ స్వామి, గంగమ్మ ఆలయం వద్ద విందులో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు తుమ్మల మనోహర్, సూర్యశేఖరరాజు, అశోక్, నంద, మల్లెల నారాయణస్వామి, సురేంద్ర ఉన్నారు.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యురాలు

పేదలకు కంటి వెలుగు ప్రసాదించడమే లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజలకు కంటి వెలుగు ప్రసాదించడమే లక్ష్యమని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత ఐఒఎల్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ షేక్ సికిందర్ సహకారంతో యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు వారి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో కంటి డాక్టర్ నవ్య 98 మందిని పరీక్షించి 52 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారని, వారిని బెంగళూరుకు పంపించామని తెలిపారు. రోగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, స్టార్ ఖలీల్, పోలా ప్రభాకర్, వైకె.శ్రీనివాసులు, చాంద్‌బాషా, కౌన్సిలర్ కేతా లోకేష్, బండ్లపల్లి రంగనాథం, రమేష్‌బాబు, రాధాకృష్ణ, సత్రశాల మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

పట్టణంలోని రేషన్ షాపులను ఆదివారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. కార్డుదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని జెసి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే కార్డుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. జెసి వెంట సిఎస్‌డిటి మునిస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సమావేశమైన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో సమావేశమయ్యారు. సుమారు 21 ఏళ్ల తర్వాత కలవడంతో ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలాగే ప్రస్తుత హెచ్‌ఎం నాగ రత్నమ్మను సన్మానించారు. ఆర్గనైజర్లుగా రావి రామ్మోహన్‌నాయుడు, దస్తగిరి, నడిమింటి షెక్షావలి, గోనుగుంట్ల శ్రీనివాస చౌదరి, పామల్ల రమేష్, ఈసీ.చిట్టి, గోసే పరమేష్, వెంకట నాయుడు, చైతన్య కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో మారెన్న, చెన్నకృష్ణారెడ్డి, శ్రీనివాసప్రసాద్, రాఘవేంద్ర, న్యాముతుల్లాఖాన్, సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత శివంపల్లి జట్టు

తాడిమర్రి : మండలంలోని శివంపల్లి గ్రామంలో నిర్వహించిన రవితేజ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా శివంపల్లి జట్టు నిలిచింది. టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శివంపల్లి, గొట్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన గొట్లూరు టీం 14 ఓవర్లలో 110 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శివంపల్లి టీం 12.4 ఓవర్లలో 111 పరుగులు చేసి విజయం సాధించింది. క్రీడాకారులకు, చూసేందుకు వచ్చిన క్రికెట్ అభిమానులకు నిర్వాహకులు భోజనం ఏర్పాటు చేశారు. విజేత జట్టుకు నారాయణస్వామి శివమ్మ ట్రోఫీతో పాటు రూ. 40,116, రన్నర్స్ జట్టుకు రూ. 20,116 అందజేశారు.

శివంపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

గ్రామాల్లో పోలీసుల సోదాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఫ్యాక్షన్ గొడవలకు స్వస్తి పలికి ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యాత్మక గ్రామాల్లో సోదాలు చేశారు. నేరాల నియంత్రణ, గంజాయి, మద్యం అక్రమ రవాణా, నిల్వలు గుర్తించేందుకు ముదిగుబ్బ రూరల్ సిఐ శ్యామరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కొడవండ్లపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల నివాసాలను తనిఖీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను ఆపి రికార్డులను తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని, అనధికార వాహనాలను గుర్తించి జరిమానా వేశారు. గంజాయి, మద్యం, నాటుసారా, మందుగుండు సామగ్రి అక్రమ నిల్వలపై సోదాలు చేసి కొత్త, అనుమానిత వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. గ్రామసభల ద్వారా గ్రామంలో కక్షలు, కార్పణ్యాలకు స్వస్తి పలకాలని, అందరూ ప్రశాంతంగా కలిసి మెలిసి జీవించాలని పోలీసులు సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. సుమారు 25 ఏళ్ల తర్వాత కలవడంతో ప్రతి ఒక్కరూ సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేశారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.జమాల్, ఎంఇఒ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రాజగోపాల్, దామోదర్ పూర్వ విద్యార్థులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పిట్ట ఓబుల్‌రెడ్డి, నిజాం, అప్పటి విద్యార్థులు నిరంజన్, జట్కా వెంకటేష్, లక్ష్మీపతి, పోలీస్ రమణప్ప, సురేంద్ర, నరసింహారెడ్డి, హనుమంత్‌రెడ్డి, రమణ, గ్యాస్ రమణ, నిరంజన్, బాబయ్య, ఓబుళపతి, వెంకట రాముడు, కల్పన, సుమ, ఉమాదేవి, మమత, అమ్మాజాన్, నాగేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

శంకర్‌నాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎంపిడిఒ, ఉద్యోగులు

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-కదిరి టౌన్

విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులు చిరకాలం గుర్తుండిపోతారని ఎంపిడిఒ పోలప్ప తెలిపారు. కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన శంకర్‌నాయుడు కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆదివారం తోటి ఉద్యోగులు ఎంపిడిఒ అధ్యక్షతన శంకర్‌నాయుడును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, అయితే విధి నిర్వహణలో అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. కార్యక్రంలో ఈఒఆర్‌డి అంజనప్ప, మండల అధికారులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అఘాయిత్యాలను అరికట్టాలి

ప్రజాశక్తి-పావగడ

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలని వైఈఆర్ డిగ్రీ కళాశాల సోషియాలజీ విభాగాధిపతి కిష్టప్ప సూచించారు. తాలూకాలోని పళవల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వైఈఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, చట్టాలు ఉన్నప్పటికీ స్వార్థం, తదితర కారణాలతో మహిళలపై హింసకు పాల్పడుతున్నారని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవితం గడపాలని, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని, దినపత్రికలు, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రామంజని, నరసింహ, వెంకటరమణప్ప, రవికాంత్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు దినేష్‌కుమార్, శివకుమార్, శశికాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి తల్లిదండ్రులు బొల్లం రామచంద్రరెడ్డి, లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని ఆదివారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చౌడంపల్లి గ్రామం వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న రామాంజనేయులును, ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన చాంద్‌బాషాలను పరామర్శించారు. అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జెడ్పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, నర్సిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, షామీర్‌బాషా, రఫీక్, మధుసూదన్‌రెడ్డి, చిరంజీవి, గోవిందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని ఓదులపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన తాగునీటి బోరు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో గ్రామంలో బోరు వేయడంతో తాగునీటి సమస్య తీరింది. బోరు వేయడానికి సహకరించిన టిడిపి మండల కన్వీనర్ ముబారక్, జనరల్ సెక్రటరీ జయ, వీరభార్గవ్‌రెడ్డి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విష్ణు, రాజు, రాజారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు బాధ్యతల స్వీకరణ

కదిరి టౌన్ : పట్టణంలోని మున్సిపల్ ఉర్దూ మెయిన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా ఆదివారం నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కదిరి మున్సిపల్ హైస్కూల్, వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో 16 ఏళ్లగా తెలుగు ఉపాధ్యాయుడుగా, 8 ఏళ్లుగా ప్రధానోపాధ్యాయుడుగా పని చేశారు. బదిలీపెకీ పాఠశాలకు వచ్చారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రయాణం కంటే ప్రాణం మిన్న'

ముదిగుబ్బ : ప్రయాణం కంటే ప్రాణం ముఖ్యమైందని రూరల్ సిఐ శ్యామ్‌రావు సూచించారు. సిఐ సిబ్బంది తో కలిసి ఆదివారం దొరిగల్లు సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనంలో అధిక సంఖ్యలో కూలీలు వెళ్తుండగా వాహనాన్ని ఆపారు. డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి వ్యక్తులను ఎక్కించి ప్రయాణం చేయరాదని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

చెన్నేకొత్తపల్లి మండలంలోని చందమూరు గ్రామ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బడన్నపల్లి గ్రామానికి చెందిన భగవంతప్ప కుమారుడు అమర్‌నాథ్(26), ధర్మవరం పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన మహబూబ్‌బాషా ద్విచక్ర వాహనంపై చెన్నేకొత్తపల్లి మండలంలోని నాగసముద్రం గేట్ వైపు నుంచి ధర్మవరం వస్తుండగా చందమూరు గ్రామ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో అమర్‌నాథ్ అక్కడికక్కడే మృతిచెందగా, మహబూబ్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. అమర్‌నాథ్ కియా కంపెనీలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఇంకా వివాహం కాలేదు. విషయం తెలిసిన వెంటనే చెన్నేకొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై కొడవలితో దాడి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మనసులో కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి కొడవలితో దాడి చేయగా యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద చోటుచేసుకుంది. మండలంలోని మొరంపల్లికి చెందిన క్రిష్టప్ప కుమారుడు కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ప్రమాదానికి అదే గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ కారణమని క్రిష్టప్ప భావించేవాడు. ఈ క్రమంలో ఆదివారం అరుణ్‌కుమార్ కొడికొండ చెక్‌పోస్టులో హిందూపురం వైపు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సు ఎక్కబోతుండగా క్రిష్టప్ప వెనుకవైపు నుంచి కొడివలితో దాడి చేశాడు. కొడవలి దెబ్బ తలకు తగలడంతో తీవ్రంగా రక్త స్రావమైంది. అరుణ్‌కుమార్‌ను అంబులెన్స్ సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.